# కమ్యూనిస్టు యోధుడు 'గురుప్రసాదరావు'కు ఘన వీడ్కోలు

*** భారీగా తరలివచ్చిన సిపిఐ శ్రేణులు, అభిమానులు**





ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: సిపిఐ సీనియర్ నాయకులు,ఉమ్మడి ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు యోధులు, కొత్తగూడెం ప్రాంతానికి చెందిన ప్రముఖ న్యాయవాది ఆళ్ల గురుప్రసాద రావుకు సిపిఐ, ప్రజాసంఘాల శ్రేణులు, అభిమానులు, న్యాయవాదులు ఘన వీడ్కోలు పలికారు. 93 ఎడ్ల గురుప్రసాద్ వృద్ధాప్యంతో బాధపడుతూ విశాఖపట్నంలోని తన బంధువుల గృహంలో మృతి చెందాగా అయన భౌతికకాయాన్ని ఆదివారం పార్టీ శ్రేణులు, ప్రజల సందర్శనార్ధం సిపిఐ జిల్లా కార్యాలయం 'శేషగిరిభవన్'కు తరలించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కార్యవర్గ సభ్యులు బి అయోధ్యతో పాటు పలువురు ప్రముఖులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు వై ఉదయ్ భాస్కర్ అధ్యక్షతన జరిగిన సంతాప సభలో కూనంనేని మాట్లాడారు. గురుప్రసాద రావు ఉత్తమ కమ్యూనిస్టు అని, తన తుది శ్వాస వరకు ప్రజా సేవకే అంకితమయ్యారన్నారు. అయన మృతి కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని అన్నారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో కొత్తగూడెం,పరిసర మండలాల్లో రాజాకీయాలను ప్రభావితం చేసిన వ్యక్తి గురుప్రసాద్ అని, ప్రజాఉద్యమాలతో కమ్యూనిస్టు పార్టీ ప్రతిష్టను, జిల్లా ప్రతిష్టను పెంచిన వ్యక్తి గురుప్రసాద్ అని, ఎలాంటి పదవులను ఆశించకుండా కమ్యూనిస్టు పార్టీ విస్తరణకు కృషి చేశారన్నారు. అనంతరం శేషగిరిభవన్ నుంచి కొత్తగూడెం వైద్య కళాశాల వరకు జనసందోహం నడుమ అంతిమయాత్ర జరిగింది. కుటుంబ సభ్యుల కోరిక మేరకు గురుప్రసాద్ భౌతికకాయాన్ని వైద్యవిద్యార్థుల పరిశోధన నిమిత్తం కొత్తగూడెం వైద్య కళాశాలకు అప్పగించారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, మున్నా లక్ష్మీకుమారి, నరాటి ప్రసాద్, చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, తాటి వెంకటేశ్వర్లు, పాకలపాటి పెద్దబ్బాయి, ప్రముఖ వైద్యులు రమేష్‌బాబు, రామ్మోహనరావు, పట్టాభి, లాయర్స్ అసోసియేషన్ నాయకులు లక్కినేని సత్యనారాయణ, రాధాకృష్ణ, కోటం రాజు, ఎల్లంకి వెంకటేశ్వర్లు, జిల్లా సమితి సభ్యులు వంగ వెంకట్, జి వీరాస్వామి, వి మల్లికార్జున్ రావు, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, వి పూర్ణదందర్ రావు, కందుల భాస్కర్, భూక్యా దస్రు, గెడ్డాడు నగేష్, కొమారి హన్మంతరావు, మునిగడప వెంకటేశ్వర్లు, రాహుల్, ఫహీమ్, పొలమూరి శ్రీనివాస్, కె రత్నకుమారి, సిపిఎం నాయకులు లిక్కి బాలరాజు వున్నారు.

## కల్వరి టెంపుల్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం



ప్రజాస్ఫూర్తి , శేరిలింగంపల్లి : మానవసేవయే మాధవ సేవ" గా భావించి ప్రభు ప్రేమను క్రియల్లో చూపించే కల్వరి టెంపుల్ ఫౌండర్ డాక్టర్ పి సతీష్ కుమార్ ఆదేశానుసారం భరించలేని భానుడి వేడికి చుక్క నీటి కోసం పరితపించే ప్రయాణికుల కోసం చల్లటి నీటి తో పాటు చల్లటి మజ్జిగను కూడా అందించే "చలివేంద్రం" ను కల్వరి టెంపుల్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాజేష్ ప్రారంభించి స్వయం గా ఆయనే అనేక మంది దాహార్తిని తీర్చటం జరిగింది సమాజ సేవలో ఎప్పుడు ముందుండే కల్వరి టెంపుల్ మియాపూర్ వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రతి ఒక్కరు వారి దాహార్తిని తీర్చుకోవటం కోసం ప్రేమతో చేసే ఈ సర్వీస్ ను ఉపయోగించుకోవాల్సిందిగా కోరారు. అనేక మంది పాదచారులు, ద్విచక్ర వాహనదారులు, ఆటో లో బస్సుల్లో ప్రయాణించే వారు ఈ సర్వీస్ పట్ల వారి కృతజ్ఞతలు తెలియచేశారు.

## బిజెపి ముస్తాబాద్ మండల అధ్యక్షునిగా సొల్ల క్రాంతి



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: బిజెపి ముస్తాబాద్ మండల అధ్యక్షునిగా సొల్ల క్రాంతి నియమితులయ్యారు. ఈ మేరకు బిజెపి జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి నియామకపు ఉత్తర్వులను జారీ చేశారు. అదేవిధంగా జిల్లా కౌన్సెల్ మెంబర్‌గా మాజీ అధ్యక్షుడు మేరుగు అంజా గౌడ్ నియమితులయ్యారు. తన నియామకానికి సహకరించిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి, నియమించిన జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపికి సొల్ల క్రాంతి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. బిజెపి పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేస్తూ రానున్న రోజుల్లో తెలంగాణలో బిజెపి అధికారంలోకి వచ్చే విధంగా తన సాయశక్తుల కృషి చేస్తానని అన్నారు.



## ఆహ్లాదభరితమైన వాతావరణానికి పార్కులు ఎంతో అవసరం...

*** మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : ఆహ్లాదభరితమైన వాతావరణానికి పార్కులు ఎంతో అవసరమని మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ అన్నారు. ఆదివారం గాజుల రామారం డివిజన్ పరిధి ఉషోదయ కాలనీ ఫేజ్ 2 లో సుమారు రూ.80 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన విఘ్నేశ్వర పార్క్ , సమగ్ర పార్క్ లను ఆయనతో పాటు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆహ్లాదభరితమైన వాతావరణానికి, ఆరోగ్యకరమైన జీవితానికి పార్కులు ఎంతో అవసరమని అన్నారు. పిల్లల ఆటవిడుపుకు, పెద్దల మానసిక ప్రశాంతతకు పార్కులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.
పార్కులను పరిశుభ్రంగా ఉంచుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం మహాదేవపురంలో 90 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన మహదేవపురం పార్కును వారు పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, పాక్స్ డైరెక్టర్ పరిశే శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, నవాబ్ భాయ్, ఇబ్రహీం ఖాన్, తెలంగాణ సాయి, చెట్ల వెంకటేష్, సుంకరి చందు, చిన్నా చౌదరి, బాబీ చౌదరి, ఆంజనేయులు, రాములు గౌడ్, వహీద్, దూలప్ప, బోయిని మహేష్, శివ నాయక్, ప్రసాద్, ఉషోదయ కాలనీ ఫేజ్ 2 అధ్యక్షులు పి. పీరారెడ్డి, ప్రధాన కార్యదర్శి రవికాంత్, కోశాధికారి వినోద్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆంజనేయులు, ఉపాధ్యక్షులు కుమార స్వామి సభ్యులు ఉదయ్ , మహదేవపురం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రసాద్ బాబు, ఉపాధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి, రంగా రావు, కోశాధికారి ప్రభాకర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ రామచంద్ర రెడ్డి, ప్రవీణ్ కుమార్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

**ఉషోదయ కాలనీ ఫేజ్ -1 లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం**

గాజుల రామారం డివిజన్ ఉషోదయ కాలనీ ఫేజ్ 1 లో 40 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ ,బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ లు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా కుత్బుల్లాపూర్ ను అభివృద్ధి పరుస్తున్నామని, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, పాక్స్ డైరెక్టర్ పరిశే శ్రీనివాస యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, నవాబ్ భాయ్, ఇబ్రహీం ఖాన్, తెలంగాణ సాయి, చెట్ల వెంకటేష్, సుంకరి చందు, చిన్నా చౌదరి, బాబీ చౌదరి, ఆంజనేయులు, రాములు గౌడ్, వహీద్, దూలప్ప, బోయిని మహేష్, శివ నాయక్, ప్రసాద్, ఉషోదయ కాలనీ 1 వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.వి.ఎస్ సురేంద్రనాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సతీష్ బాబు, కోశాధికారి నరసింహ రెడ్డి, కార్యనిర్వహక కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్, సలహాదారు బాల్ రెడ్డి, గురుప్రసాద్ రావు, కాలనీ వాసులు రసూల్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా సంజీవని ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : కొంపల్లి మున్సిపాలిటీ పరిధి జయభేరిలో నిర్వహించిన సంజీవని ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకకు బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆయువును, ఆరోగ్యాన్ని పెంపొందించే సంజీవని ఆంజనేయ స్వామి దయతో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, పాక్స్ వైస్ చైర్మన్ రవీందర్ రెడ్డి, పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు కిరణ్, చింతల దేవేందర్, లక్ష్మణ్, జీవన్ రెడ్డి, జయభేరి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జీవన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వినోద్ రెడ్డి, ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు గిరిబాబు, వాసుదేవ రెడ్డి, సాగర్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, మన్మోహన్ పాండే, శేఖర్, సీతారామ రాజు తదితరులు పాల్గొన్నారు.

## కాలనీ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి

**: ఎంపీ, ఎమ్మెల్యేలు**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : కాలనీ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ , బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ లు అన్నారు. గాజుల రామారం డివిజన్ షిర్డీ హిల్స్ లో సుమారు 1.10 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన సాయి చిల్డ్రన్స్ పార్క్, బాలాజీ పార్క్ లను వారు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీ అభివృద్ధిలో కేవలం ప్రజా ప్రతినిధులది మాత్రమే పాత్ర కాదని, కాలనీ అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యమై పనిచేసినప్పుడే ఆ ప్రాంతం, ఆ కాలనీ వేగవంతంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, పాక్స్ డైరెక్టర్ పరిశే శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్ , అడ్వకేట్ కమలాకర్, నవాబ్ భాయ్, ఇబ్రహీం ఖాన్, తెలంగాణ సాయి, చెట్ల వెంకటేష్, సుంకరి చందు, చిన్నా చౌదరి, బాబీ చౌదరి, ఆంజనేయులు, రాములు గౌడ్, వహీద్, దూలప్ప, బోయిని మహేష్, శివ నాయక్, ప్రసాద్, షిర్డీ హిల్స్ ప్రెసిడెంట్ పి.రమేష్, ప్రధాన కార్యదర్శి సత్య బాబు, కోశాధికారి జి.బాలకిషన్, జాయింట్ సెక్రటరీ వేణుగోపాల చారి, బ్రహ్మ చారి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## సర్టిఫికెట్ కోర్సుల శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తుల ఆహ్వానం

తెలంగాణ: రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రయివేటు సంస్థలు, కంప్యూటర్, క్రాఫ్ట్, ఇతర టెక్నికల్ వృత్తులకు సంబంధించి 202526 విద్యా సంవత్సరంలో సర్టిఫికెట్ కోర్సులను అందించేందుకు అనుబంధ గుర్తింపు పొందాలని రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ మండలి (ఎస్ బీ టెట్) కార్యదర్శి ఎ.పుల్లయ్య తెలిపారు. ఈ నెల 12 వరకు ఆన్ లైన్‌లో ధరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అలాగే దర ఖాస్తు చేసుకునేందుకు రూ.2000 లేట్ ఫీజుతో 15వరకు అవకాశం ఉందన్నారు. ధరఖాస్తులను www.af fln. sbtet.telangana.gov.in/ccic ద్వారా సమర్పించాలని, వివరాలకు 8008908304 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## జిల్లా విస్తృత స్థాయి కార్యవర్గం సమావేశాన్ని విజయవంతం చేయాలి

*** టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : అల్వాల్ సర్కిల్ పరిధిలోని వి బి ఆర్ గార్డెన్ లో సోమవారం నిర్వహించనున్న జిల్లా విస్తృత స్థాయి కార్యవర్గం సమావేశానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో సంవిధాన్ బచావో సభ" "జై బాపు జై భీమ్ జై సంవిధాన్ ర్యాలీ", మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా విస్తృత స్థాయి కార్యవర్గం సమావేశం జరుగుతుందని తెలిపారు. అల్వాల్ సర్కిల్ ఈ సేవ కేంద్రం రాజీవ్ గాంధీ విగ్రహం నుండి అల్వాల్ సర్కిల్ ఇందిరా గాంధీ విగ్రహం వరకు "సంవిధాన్ బచావో పాదయాత్ర" కార్యక్రమం నిర్వహించ నున్నట్లు తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, అనుబంధ సంస్థల చైర్మన్లు, కార్పొరేషన్ అధ్యక్షులు, ఏ బ్లాక్, బి బ్లాక్, డివిజన్, మండల, మున్సిపల్ అధ్యక్షులు ఉపాధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంస్థల అధ్యక్షులు ఉపాధ్యక్షులు మహిళ అధ్యక్షురాలు ఉపాధ్యక్షురాలు యువజన విభాగం , ఎన్ఎస్యుఐ అధ్యక్షులు ఉపాధ్యక్షులు తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు

# ప్రజలకు వేగంగా న్యాయం చేసి.. వారి అభిమానాన్ని పొందాలి: తెలంగాణ డీజీపీ

హైదరాబాద్: రాష్ట్ర ప్రజలకు వేగంగా న్యాయం చేసి వారి అభిమానాన్ని పొందాలని ఇన్‌స్పెక్టర్లకు డీజీపీ జితేందర్ సూచించారు. పోలీస్ స్టేషన్లకు ప్రజలు వచ్చినప్పుడు వారికి న్యాయం జరిగేలా చూడాలని.. తద్వారా వారికి మిత్రులుగా మారుతారని అన్నారు. ప్రజలకు న్యాయం చేసినప్పుడు పోలీస్ అధికారులు మంచి పేరు తెచ్చుకోవడంతో పాటు ప్రజల హృదయాల్లో నిలిచిపోతారని వివరించారు. పోలీసులు పక్షపాత ధోరణితో వ్యవహరిస్తే చెడ్డ పేరు కూడా వస్తుందనే విషయాన్ని పోలీసులు గుర్తుపెట్టుకోవాలన్నారు. రాష్ట్రంలోని అన్ని యూనిట్ల నుంచి వచ్చిన ఇన్‌స్పెక్టర్లతో డీజీపీ సమావేశమయ్యారు. "రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మిస్ వరల్డ్ పోటీలను నిర్వహించనుంది. స్టేషన్ హౌస్ ఆఫీసర్లు తమ తమ ప్రాంతాల్లో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి. అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ పోలీసులు తమ శక్తి సామర్థ్యాలను చాటుకునే అవకాశం వచ్చింది. అందుకు అనుగుణంగా కృషి చేయాలి. పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావడంలో స్టేషన్ హౌస్ ఆఫీసర్ల పాత్ర ఎంతో కీలకం. దేశంలోనే ఉత్తమ పోలీస్ శాఖగా ఎంపికైన తెలంగాణలో పనిచేస్తున్న సిబ్బంది ఆ స్థాయిని నిలుపుకోవాలి. సాధించింది కొంత మాత్రమే.. చేయాల్సింది ఇంకా ఎంతో ఉంది అనేలా



పోలీసులు పనిచేయాలి" అని డీజీపీ సూచించారు.



## ఘనంగా గుబ్బల లక్ష్మీనారాయణ జన్మదిన వేడుకలు

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి ) : సుభాష్ నగర్ డివిజన్ బిఆర్ఎస్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ను ఆయన నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం గుబ్బల లక్ష్మీనారాయణ తో కేక్ కట్ చేయించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ ప్రజాక్షేత్రంలో పదవులు పొందాలని, ఆయురారోగ్యాలతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి, ఎస్సార్ నాయక్ నగర్ మాజీ ప్రెసిడెంట్ ఆలూరీ వెంకట శేషయ్య, బొలిశెట్టి దుర్గారావు, కాలనీ వైస్ ప్రెసిడెంట్ హరిబాబు యాదవ్, కాలనీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ పూర్ణచంద్రగుప్త, నాయకులు సాయిరాం రెడ్డి, అలీ భాయ్, కిషోర్, ఎస్ వి జి నాయుడు, కాకి వెంకట రమణమూర్తి, వల్లూరీ ప్రసాద్, మురళి, వెంకటేష్ కుడిపూడి, శ్రీనివాసులు, నారాయణ, శివప్రసాద్, కిషోర తదితరులు పాల్గొన్నారు.



## గ్రామ దేవతల ఆరాధన తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం

* **ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య తో పాటు పాల్గొన్న నాగా సీతారాములు**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఇల్లందు నియోజకవర్గ పరిధిలోని టేకులపల్లి మండలం, కోయగూడెం గ్రామం నందు బొడ్రాయి ప్రతిష్ట , ముత్యాలమ్మ వార్లు , పోతురాజు , భక్తాంజనేయ స్వామి వారి యంత్ర ,విగ్రహ శిలధ్వజ శిఖర ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య తో పాటు , పాల్గొన్న టిపిసిసి సభ్యులు నాగాసీతారాములు. గ్రామస్తులు నాగాసీతారాములకు ఘన స్వాగతం పలికారు. వారు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలలో పాల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామదేవతలు తెలంగాణ రాష్ట్ర ఆత్మగౌరవానికి ప్రతిబింబాలు అని వారు అంటూ, గ్రామదేవతల ఆశీస్సులు స్థానిక ప్రజలపై ఉండాలని పాడిపంటలు, అష్టైశ్వర్యాలతో ,ప్రజల సుఖ సంతోషాలతో, ఆరోగ్యంగా ఉండాలని వారు ఆకాంక్షించారు . అనంతరం గ్రామస్తులు టిపిసిసి సభ్యులు నాగాసీతారాములకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు . అనంతరం ఎమ్మెల్యే కోరం కనకయ్య తో కలిసి మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన నాగాసీతారాములు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు , భక్తులు , మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు .

## డేంజర్ బెల్స్.. ఈ జిల్లాల ప్రజలు బయటకు రావొద్దు.. వాతావరణ శాఖ తీవ్ర హెచ్చరిక




రాష్ట్రానికి వాతావరణ శాఖ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. తెలంగాణలో గత కొన్ని రోజుల నుంచి వాతావరణంలో భిన్న పరిస్థితులు చోటుచేసుకుంటున్నాయి. పగలంతా ఎండలు దంచికొడుతుంటే, సాయంత్రం కాగానే ఉరుములు, మెరుపులతో భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాష్ట్రంలో రోజురోజుకు రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో తాజాగా రాష్ట్రంలోని 13 జిల్లాల్లో జూన్ వరకు తీవ్ర వడగాలుల ముప్పు ఉందని డిజాస్టర్ మేనేజ్‌మెంట్ తెలిపింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, జగిత్యాల, నిర్మల్, కరీంనగర్, వరంగల్, ములుగు, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, పెద్దపల్లి, మంచిర్యాల, నల్గొండ జిల్లాల్లో వడగాలులు తీవ్ర స్థాయిలో ఉంటాయని పేర్కొంది. వడగాలుల వల్ల చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు, వృద్ధులు, రోగులు బయటకు వెళ్లొద్దని వైద్య నిపుణులు సూచించారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో తీవ్ర వడగాలులు వీస్తున్నాయి. ఈ నెలతో పాటు జూన్ లోనూ పరిస్థితి కఠినంగా ఉండనుందని విపత్తుల నిర్వహణ సంస్థ అంచనా వేస్తోంది. తీవ్రమైన ఎండల నేపథ్యంలో ప్రజలు బయటకు వెళ్ళినప్పుడు తప్పనిసరిగా నీరు, నిమ్మరసం, మజ్జిగ, గ్లూకోజ్ లేదా ఓఆర్ఎస్ వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. వృద్ధులు, పిల్లలు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## దక్షిణ తెలంగాణకు గత ప్రభుత్వం అన్యాయం చేసింది : మంత్రి ఉత్తమ్



మిర్యాలగూడ: ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును అనుకున్న సమయానికి పూర్తి చేస్తామని, ఆగిపోయిన కందమల్ల ప్రాజెక్టును తిరిగి ప్రారంభిస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మిర్యాలగూడలో ఉమ్మడి నల్గొండ జిల్లా అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వం కేవలం కాళేశ్వరంపైనే ఎక్కువ దృష్టి పెట్టిందని, దక్షిణ తెలంగాణకు చేసిన అన్యాయం స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. ఎస్ఎల్‌బీసీ, దేవాదుల ప్రాజెక్టులను పూర్తి చేయలేదని.. పాలమూరురంగారెడ్డి, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమ ప్రాజెక్టులను పట్టించుకోలేదని మండిపడ్డారు. తమ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.23వేల కోట్లు కేటాయించినట్లు మంత్రి ఉత్తమ్ తెలిపారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో కాంగ్రెస్ నిర్లక్ష్యం

**: హరీశ్‌రావు**

హైదరాబాద్: విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరి విద్యార్థుల పాలిట శాపంగా మారిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ కళాశాలలకు దాదాపు రూ.800 కోట్ల మేర ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. డిగ్రీ పరీక్షలు నిర్వహించాలని విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వాన్ని వేడుకునే దుస్థితి రావడం ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనమని మండిపడ్డారు. సకాలంలో పరీక్షలు నిర్వహించకపోవడంతో పీజీసెట్, లాసెట్, ఇతర పోటీ పరీక్షలు రాయడానికి మూడో సంవత్సరం విద్యార్థులు అర్హత కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా సీఎం, మంత్రులు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.



## మావోయిస్టులతో మాటల్లేవ్.. మాట్లాడుకోడాల్లేవ్.. బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు



కరీంనగర్: మావోయిస్టులతో చర్చల ప్రసక్తే లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ తెలిపారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలో ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. "తుపాకీతో అమాయకులను చంపేవారితో చర్చలు ఉండవు. మావోయిస్టులతో ఇక మాటల్లేవ్.. మాట్లాడుకోడాల్లేవ్. వారిపై నిషేధం విధించింది కాంగ్రెస్సే. మావోయిస్టులు.. పలు పార్టీల నేతలను మందుపాతరలు పెట్టి చంపారు. ఇన్‌ఫార్మర్ల పేరుతో గిరిజనులను అన్యాయంగా పొట్టన పెట్టుకున్నారు. ఎన్నో గిరిజనుల కుటుంబాలకు మానసిక క్షోభ మిగిల్చారు. తుపాకీ వదిలిపెట్టేవరకు మావోయిస్టులతో చర్చల ఊసే ఉండదు. పాస్‌పోర్టు లేని విదేశీయులను గుర్తించి పంపిస్తున్నాం. రోహింగ్యాలపై తన వైఖరి ఏమిటో కాంగ్రెస్ పార్టీ చెప్పాలి" అని బండి సంజయ్ అన్నారు.

## తెలంగాణ హైకోర్టు సిట్టింగ్ జడ్జి జస్టిస్ గిరిజా ప్రియదర్శిని కన్నుమూత

* **తెలంగాణ హైకోర్టు సిట్టింగ్ జడ్జి జస్టిస్ గిరిజా ప్రియదర్శిని మృతి**
* **ఆదివారం ఉదయం హైదరాబాద్‌లో అనారోగ్యంతో తుది శ్వాస**
* **సోమవారం జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో అంత్యక్రియలు**

తెలంగాణ హైకోర్టు సిట్టింగ్ జడ్జి జస్టిస్ మాటూరి గిరిజా ప్రియదర్శిని (61) ఆదివారం ఉదయం కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె హైదరాబాద్‌లోని తన నివాసంలో తుది శ్వాస విడిచారు. ఆమె వయసు 61 సంవత్సరాలు. జస్టిస్ ప్రియదర్శిని భౌతికకాయాన్ని హాఫీజ్‌పేటలోని ఆమె నివాసంలో ఉంచారు. అంత్యక్రియలు సోమవారం నాడు జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. జస్టిస్ ప్రియదర్శిని మృతి పట్ల హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్, ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. 1995లో న్యాయవాదిగా తన వృత్తిని ప్రారంభించిన జస్టిస్ ప్రియదర్శిని, విశాఖపట్నంలో సివిల్, క్రిమినల్, లేబర్ లా, వైవాహిక వివాదాలకు సంబంధించిన కేసులను వాదించారు. 2008 నవంబర్‌లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా జిల్లా జడ్జిగా ఎంపికై న్యాయ సేవలో చేరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో అదనపు జిల్లా జడ్జిగా సేవలందించారు. అనంతరం పదోన్నతి పొంది, 2022 మార్చి 24న తెలంగాణ



హైకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు. సీనియారిటీ ప్రకారం ఆమె 16వ స్థానంలో ఉన్నారు. వచ్చే ఏడాది ఆమె పదవీ విరమణ చేయాల్సి ఉంది. విశాఖపట్నం ఎన్‌బీఎం లా కాలేజీ నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందిన ఆమె, ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి లేబర్ అండ్ ఇండస్ట్రియల్ లాలో ఎల్ఎల్ఎం పూర్తి చేశారు. అంతకుముందు సోషియాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్‌లలో మాస్టర్స్ డిగ్రీలు కూడా పొందారు.

# కోహినూర్ వజ్రాన్ని భారత్‌కు తిరిగి ఇచ్చేస్తారా..? బ్రిటన్ మంత్రి ఏమన్నారంటే?

దిల్లీ: బ్రిటన్ మహారాణి కిరిటంలో పొదివి ఉన్న కోహినూర్ వజ్రం విశిష్టత గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. దానిని తిరిగి భారత్‌కు ఇచ్చేస్తారా? అన్న ప్రశ్నకు బ్రిటన్ సాంస్కృతిక, మీడియా, క్రీడల శాఖ మంత్రి లీసా నాండీ బదులిచ్చారు. భారత్, బ్రిటన్ మధ్య సాంస్కృతిక కళాఖండాల మార్పిడి కోసం ఉన్నత స్థాయిలో సంప్రదింపులు జరుగుతున్నట్లు చెప్పారు. అన్నీ సానుకూలంగా జరిగితే.. అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం రావొచ్చని నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. ఇదే అంశంపై భారత్ సాంస్కృతిక శాఖ మంత్రితోనూ చర్చించినట్లు చెప్పారు. అధికారిక పర్యటనలో భాగంగా ప్రస్తుతం లీసా నాండీ భారత్‌లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా దిల్లీలో ఆమె మీడియాతో మాట్లాడారు. సృజనాత్మకత, సాంస్కృతిక, క్రీడా రంగాల్లో భారత్‌లో దృఢమైన భాగస్వామ్యాన్ని కోరుకుంటున్నట్లు లీసా తెలిపారు. ''సినిమా, టీవీ, మ్యూజిక్, క్రీడా రంగాల్లో బ్రిటన్ దూసుకుపోతోంది. ఆయా రంగాలకు సంబంధించిన బ్రిటన్ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉంది. భారత్ సహకరిస్తే.. వాటిని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్ల వచ్చన్న గట్టి నమ్మకం మాకుంది. అందుకు భారత్ కూడా మద్దతిస్తుందని ఆశిస్తున్నాం'' అని లీసా తెలిపారు.



భారత్ పర్యటన కోసం శుక్రవారం దిల్లీ చేరుకున్న ఆమె.. సాంస్కృతిక శాఖకు సంబంధించిన పలు ఒప్పందాల గురించి కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తో చర్చలు జరుపుతున్నారు. మరోవైపు పహల్గాం ఉగ్రదాడిపైనా ఆమె స్పందించారు. ఈ దారుణఘటనలో ప్రాణాలు కోల్పోయిన 26 మందికి నివాళులర్పించారు. ఇలాంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించరాదని, ఉగ్రవాదం నిర్మూలనకు ప్రపంచదేశాలన్నీ కలిసి రావాలని పిలుపునిచ్చారు. కాగా, భారత్‌కు చెందిన 108 క్యారెట్ల విలువైన కోహినూర్ వజ్రాన్ని 1849లో మహారాజ్ దులీప్ సింగ్.. విక్టోరియా మహారాణికి ఇచ్చేశారు. అప్పటి నుంచి ఆ వజ్రం వారి ఆధీనంలోనే ఉంది. రాణి కిరీటంలో అమర్చారు. అయితే, దానిని తిరిగి తీసుకోవాలని భారత ప్రభుత్వం దౌత్యమార్గాల్లో ప్రయత్నించినప్పటికీ.. అది కార్యరూపం దాల్చలేదు.




# బోధకులు వద్దు.. భాగస్వాములు కావాలి జైశంకర్

భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ యూరప్ దేశాధినేతలతో సమావేశమయ్యారు. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ.. భారత్‌తో యూరప్ సన్నిహిత సంబంధాలు నెలకొల్పాలంటే స్నేహస్వభావం, పరస్పర ఆసక్తి కలిగి ఉండాలని అన్నారు. ప్రపంచం ఎలా పని చేస్తుందో గమనించాలని సూచించారు. న్యూదిల్లీ ప్రపంచ దేశాల వైపు చూసినప్పుడు బోధకుల కోసం కాకుండా..భాగస్వాముల కోసం ఎదురు చూస్తోందని వ్యాఖ్యానించారు. బోధకులు బయటి వారికి చెప్పే విషయాలను తమ సొంతం దేశంలో పాటించరని జైశంకర్ అన్నారు. యూరప్‌లోని చాలా ప్రాంతాలు ఇప్పుడు అటువంటి సమస్యనే ఎదుర్కొంటున్నాయని తెలిపారు. భారత్‌కు యూరప్‌తో దాదాపు 40ఏళ్ల స్నేహబంధం ఉందని..కొన్నేళ్లక్రితం దానితో పలు ఒప్పందాలు చేసుకున్నామని జైశంకర్ పేర్కొన్నారు. రష్యా ఉక్రెయిన్ యుద్ధ నివారణకు మాస్కో ప్రమేయం లేకుండా పశ్చిమ దేశాలు చేసిన పలు ప్రయత్నాలను విదేశాంగ మంత్రి విమర్శించారు. భారత్ ఎల్లప్పుడూ వాస్తవికతను సమర్థిస్తుందని ఆయన పేర్కొన్నారు.

# 'అది నా బాధ్యత.. మీరు కోరుకున్నది కచ్చితంగా జరుగుతుంది'

**: రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు**



దిల్లీ: భారత్ పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న తరుణంలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్‌పై దాడులకు ప్రయత్నించేవారికి తగిన రీతిలో సమాధానం చెబుతామని హెచ్చరించారు. దేశ సరిహద్దుల భద్రతతో పాటు సైనికులను కాపాడటం రక్షణ మంత్రిగా తన బాధ్యత అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పని తీరు, పట్టుదల గురించి అందరికీ తెలుసన్న రాజ్‌నాథ్.. ఆయన నాయకత్వంలో ప్రజలు కోరుకున్నది కచ్చితంగా జరిగి తీరుతుందని తాను హామీ ఇస్తున్నానన్నారు. ఇటీవల పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు, పాక్‌పై ప్రతీకార చర్యలను కేంద్రం పరిశీలిస్తున్న వేళ రాజ్‌నాథ్ వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. దిల్లీలో జరిగిన సంస్కృతి జాగరణ్ మహోత్సవ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ''మన వీర సైనికులు ఎల్లప్పుడూ దేశ భౌతిక స్వరూపాన్ని కాపాడుతుంటే.. రుషులు, జ్ఞానులు దేశ ఆధ్యాత్మిక రూపాన్ని పరిరక్షిస్తున్నారు. ఒక వైపు మన సైనికులు యుద్ధ భూమిపై పోరాడుతుంటే..సాధువులు జీవన భూమిపై పోరాడుతున్నారు. దేశ సరిహద్దుల భద్రతతో పాటు సైనికులను కాపాడటం నా బాధ్యత. దేశంపై దాడికి ప్రయత్నించేవారికి తగిన రీతిలో బదులివ్వడం నా విధి. మీకు మన ప్రధాని గురించి బాగా తెలుసు. ఆయన వర్కింగ్ స్టైలేంటో, పట్టుదల ఏంటో తెలుసు. ఆయన సారథ్యంలో మీరు కోరుకున్నది కచ్చితంగా జరుగుతుందని మీకు హామీ ఇస్తున్నా. భారత్ శక్తి సాయుధ దళాల్లోనే కాదు.. దాని సంస్కృతి, ఆధ్యాత్మికతలోనూ ఉంది'' అని వ్యాఖ్యానించారు.

## 15 గంటల పాటు ప్రెస్ మీట్.. మాల్దీవుల అధ్యక్షుడు ప్రపంచ రికార్డ్

మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు ఏకంగా 15 గంటల పాటు ప్రెస్ మీట్ నిర్వహించి రికార్డు నెలకొల్పారు. ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవం సందర్భంగా విలేకరుల సమావేశం నిర్వహించిన ఆయన 14గంటల 54నిమిషాల పాటు మీడియాతో మాట్లాడినట్టు ముయిజ్జు కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. అర్ధరాత్రి తర్వాత కూడా సమావేశం కొనసాగిందని గతంలో ఏ అధ్యక్షుడూ ఇంత సుధీర్ఘంగా ప్రెస్ మీట్ నిర్వహించలేదని పేర్కొంది. జర్నలిస్టుల ప్రశ్నలకు నిరంతరం సమాధానమిచ్చారని వెల్లడించింది.

# పాక్ కోసం 'ఇగ్లా'లు సిద్ధం చేసిన భారత్..!

సంక్షోభ సమయంలో వాడేందుకు వీలుగా భారత్ స్వల్ప శ్రేణి ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను కూడా సిద్ధం చేస్తోంది. కొన్నాళ్ల క్రితమే రష్యా తయారీ ఇగ్లా ఎస్ మిసైల్స్ దిగుమతి చేసుకొంది. ఇవి వెరీషార్ట్ రేంజి ఎయిర్ డిఫెన్స్ కిందకు వస్తాయి. సైనికదళాలకు ప్రభుత్వం ఇచ్చిన ఎమర్జెన్సీ ప్రొక్యూర్‌మెంట్ పవర్స్‌ను వాడి వీటిని కొనుగోలు చేశారు. వాస్తవానికి కొన్ని వారాల క్రితమే ఇవి భారత్‌కు చేరుకొన్నాయి. ఈ క్రమంలో సంక్షోభం తలెత్తడంతో ప్రత్యర్థులకు సమాధానం ఇచ్చేందుకు వీటిని సిద్ధం చేస్తోంది. ఈ స్వల్పశ్రేణ క్షిపణులతో ఫైటర్ జెట్ ఎయిర్ క్రాఫ్ట్‌లు, ఛాపర్స్, డ్రోన్లను ధ్వంసం చేయవచ్చు. దాదాపు రూ.260 కోట్ల వ్యయంతో వీటిని కొనుగోలు చేశారు. ముఖ్యంగా పశ్చిమ సెక్టార్లో సరిహద్దుల వద్ద వాడేందుకు ఇవి అత్యంత అనువుగా ఉంటాయి. భారత వాయుసేన అమ్ములపొదిలో కూడా ఇవి ఉన్నాయి. ఫాస్ట్‌ట్రాక్ ప్రొక్యూర్‌మెంట్ కింద ఇటీవల కాలంలో ఆయుధాల



విడిభాగాలు వంటివి కూడా దిగుమతి చేసుకొంటున్నారు. దళాలను యుద్ధ సన్నద్ధతగా ఉంచడానికి ఇవి బాగా ఉపయోగపడుతన్నాయి. తాజాగా కూడా 48 లాంచర్లు, 90 ఇగ్లాఎస్ క్షిపణుల కోసం సైన్యం టెండర్ విడుదల చేసింది. వీటిని ఫాస్ట్‌ట్రాక్ ప్రొక్యూర్‌మెంట్ కిందే కొనుగోలు చేయనున్నాయి. వీటితోపాటు కొత్త తరం ఇగ్లాలపై కూడా దృష్టిపెట్టారు. వీటికి లేజర్‌బీమ్ రైడింగ్ సామర్థ్యం కూడా ఉంది. 1990 నుంచి ఇగ్లాను భారత్ సైన్యం వినియోగిస్తోంది. దేశీయంగా ఉన్న సంస్థలు వీటిల్లో మార్పుతో ఇగ్లా ఎస్ వెర్షన్ సిద్ధం చేశాయి. పాక్ సైన్యం పలు రకాల డ్రోన్లు, యూఏవీలు వినియోగిస్తోంది. ఈ నేపథ్యంలో ఇగ్లా ఎస్ క్షిపణుల అవసరం భారత్‌కు ఎక్కువగా ఉండొచ్చని భావిస్తున్నారు. వీటిలతోపాటు మన దళాలు దేశీయంగా అభివృద్ధి చేసిన ఇంటిగ్రేటెడ్ డ్రోన్ డిటెక్షన్ అండ్ ఇంటర్‌డిక్షన్ సిస్టమ్‌ను కూడా మోహరించనుంది.

## ఇజ్రాయెల్‌పై క్షిపణి దాడి..

# దిల్లీ- టెల్ అవీవ్ విమానం అబుదాబీకి మళ్లింపు




దిల్లీ: ఇజ్రాయెల్‌లోని కీలక నగరమైన టెల్ అవీవ్ శివారులోని బెన్ గురియన్ విమానాశ్రయం సమీపంలో క్షిపణి దాడితో ఎయిరిండియా అధికారులు అప్రమత్తమయ్యారు. దిల్లీ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఎయిరిండియా విమానాన్ని అధికారులు అబుదాబీకి మళ్లించారు. ఎయిర్ ఇండియా బోయింగ్ 787 విమానం AI139 టెల్ అవీవ్‌లో ల్యాండ్ కావడానికి దాదాపు గంట ముందు ఈ దాడి జరగడంతో దారి మళ్లించినట్లు సమాచారం. ఈ విమానం తిరిగి దిల్లీకి వచ్చేస్తుందని సదరు వర్గాలు పేర్కొన్నాయి. ఫ్లైట్ ట్రాకింగ్ వెబ్‌సైట్ Flightradar24.com ప్రకారం.. అబుదాబీకి మళ్లించాలని నిర్ణయం తీసుకున్న సమయానికి ఈ విమానం జోర్డాన్ గగనతలంలో ఉంది. తాజా పరిణామాల నేపథ్యంలో టెల్ అవీవ్ నుంచి దిల్లీకి ఆదివారం రావాల్సిన ఎయిరిండియా విమానం రద్దయింది.

*** టెల్ అవీవ్‌కు ఎయిరిండియా విమాన సర్వీసులు రద్దు**


మరోవైపు, టెల్ అవీవ్‌లో తాజా పరిణామాల నేపథ్యంలో మే 6 వరకు విమాన సర్వీసులు రద్దు చేస్తున్నట్లు ఎయిరిండియా ప్రకటించింది. వినియోగదారులు, సిబ్బంది భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. తమ ఉద్యోగులు కస్టమర్లకు సహాయం చేస్తూ ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో వారికి సహాయం చేస్తున్నట్లు పేర్కొంది. మే 4 నుంచి 6 మధ్య ప్రయాణాలకు టికెట్లు బుక్ చేసుకున్న వారికి పూర్తి మొత్తాన్ని రిఫండ్ చేస్తామని 'ఎక్స్'లో పేర్కొంది. ఇతర సమాచారం కోసం 01169329333, 01169329999 నంబర్లు లేదా తమ అధికారిక వెబ్‌సైట్ airindia.comను సంప్రదించవచ్చని సూచించింది.

*** అంతకు ఏడురెట్లు బలంగా దెబ్బకొడతాం: ఇజ్రాయెల్ రక్షణ మంత్రి**

యెమెన్ నుంచి హూతీ తిరుగుబాటుదారులు ప్రయోగించిన క్షిపణి ఆదివారం ఉదయం బెన్ గురియన్ విమానాశ్రయం ప్రధాన టెర్మినల్ సమీపంలో కూలినట్లు ఇజ్రాయెల్ అధికారులు వెల్లడించారు. ఈ క్షిపణి దాడి సమీపంలో టెల్ అవీవ్ శివారులో ఉన్న విమానాశ్రయం సమీపంలో దట్టమైన పొగలు అలముకున్నట్లు ఉన్న వీడియో ఫుటేజీలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. ఈ క్షిపణి దాడి నేపథ్యంలో టెల్ అవీవ్‌లోని విమానాశ్రయానికి విమాన రాకపోకలు నిలిపివేశారు. ఈ క్షిపణి దాడిలో ఆరుగురికి గాయాలైనట్లు సమాచారం. ఈ ఘటనపై ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ మాట్లాడుతూ.. తమపై దాడిచేసిన వారికి.. అంతకు ఏడు రెట్లు బలంగా దెబ్బతీస్తామని హెచ్చరించారు.

# ప్రధాని మోదీతో ఎయిర్ చీఫ్ మార్షల్ భేటీ

దిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీతో ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ భేటీ అయ్యారు. దిల్లీలోని ప్రధాని నివాసంలో ఈ సమావేశం జరిగింది. భారత్‌పాక్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న వేళ ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. అంతకు ముందు రోజే నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేశ్ కె త్రిపాఠీ కూడా ప్రధానిని ఆయన నివాసంలో కలుసుకున్నారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ భేటీ జరిగింది. ఉగ్రవాదులపై చర్యలు తీసుకునేందుకు త్రివిధ దళాలకు ఈ భేటీలో పూర్తి స్వేచ్ఛను ఇచ్చారు. లక్ష్యాలు, దాడి సమయం అవి నిర్ణయిస్తాయని నాడు సీసీఎస్ వెల్లడించింది. ఇక శుక్రవారం సన్నద్ధతలో భాగంగా యూపీలోని గంగా ఎక్స్‌ప్రెస్‌వేపై వాయుసేన యుద్ధ విమానాల ల్యాండిగ్, టేకాఫ్ విన్యాసాలను నిర్వహించింది. 2019లో పుల్వామా దాడికి ప్రతీకారంగా భారత్ వాయుసేన పాక్‌లోకి ప్రవేశించి దాడి చేసింది. నాటితో పోల్చుకొంటే



రఫెల్ యుద్ధ విమానాలు, ఎస్400 ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలతో ఐఏఎఫ్ శక్తి గణనీయంగా పెరిగింది.

# వర్క్ ఫ్రమ్ బెంగళూరు చేసే జగన్‌కు రైతుల గురించి ఏం తెలుసు?

*** మంత్రి నాదెండ్ల**

అమరావతి: రైతులను అవమానపరిచే విధంగా మాజీ సీఎం వైఎస్ జగన్ మాట్లాడుతున్నారని మంత్రి నాదెండ్ల మనోహర్ విమర్శించారు. వర్క్ ఫ్రమ్ బెంగళూరు చేసే జగన్‌కు రైతుల గురించి ఏం తెలుసని ప్రశ్నించారు. అన్నదాతలపై జగన్‌కు ఏమాత్రం అవగాహన లేదన్నారు. రైతులను మోసం చేసిన వైకాపా.. రూ. 1,674 కోట్లు బకాయి పెట్టిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రూ.11



వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో రైతులను తీవ్రంగా వేధించారని నాదెండ్ల విమర్శించారు.

# నాపై నిరాధార ఆరోపణలు.. భూమా అఖిలప్రియ

- **ఆరోపణలు నిరూపిస్తే రాజీనామా చేస్తానని సవాల్**
- **అహోబిలంలో అక్రమ నిర్మాణాలను కూల్చేందుకు సిద్ధమని వెల్లడి**
- **ఆళ్లగడ్డలో చికెన్ వ్యాపారం గురించి అవాస్తవ కథనాలు రాస్తున్నారని ఫైర్**



వైసీపీ నాయకులు తనపై నిరాధార, తప్పుడు ఆరోపణలు చేస్తున్నారంటూ ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తీవ్రంగా మండిపడ్డారు. ఓ దినపత్రికలో తనపై తప్పుడు కథనాలు ప్రచురిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను బీట్యాక్స్ వసూలు చేస్తున్నానని కథనాలు ప్రచురించారని విమర్శించారు. తనపై వచ్చిన ఆరోపణలపై చర్చకు సిద్ధమని ఆమె స్పష్టం చేశారు. ఆరోపణలు నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానని ఆమె సవాల్ విసిరారు. ఈ మేరకు శనివారం నంద్యాలలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో అఖిలప్రియ మీడియాతో మాట్లాడారు. అహోబిలంలో అక్రమంగా సత్రాలు, హోటళ్లు నిర్మిస్తున్నారని, వాటికి తాను అనుమతిచ్చానని ఈ ఏడాది ఫిబ్రవరిలో ఓ పత్రిక రాసిందని తెలిపారు. అయితే, అహోబిలం సర్పంచ్ వైసీపీ నేత అని ఆమె గుర్తుచేశారు. గ్రామ పరిధిలో నిర్మాణాలు చేపట్టాలంటే సర్పంచ్ అనుమతి, గ్రామ పంచాయతీ తీర్మానం అవసరమనే విషయం వైసీపీ నేతలు మర్చిపోయారని చెప్పారు. అక్రమాలకు పాల్పడింది వైసీపీ నేతలైతే తనపై తప్పుడు కథనాలు ప్రచురిస్తున్నారని అఖిలప్రియ మండిపడ్డారు. అహోబిలంలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను కూల్చేందుకు తాను సిద్ధమని, వైసీపీ వాళ్లు కూడా సిద్ధమేనా అని నిలదీశారు. ఇక ఆళ్లగడ్డలోనూ చికెన్ వ్యాపారంపై అవాస్తవాలతో కథనాలు ప్రచురించారని అఖిలప్రియ ఆగ్రహం



# 60 రోజుల్లోనే 339 అభివృద్ధి పనులు పూర్తి.. కోటంరెడ్డిని అభినందించిన నారా లోకేశ్

- **నెల్లూరు రూరల్ అభివృద్ధి అద్భుతం... మంత్రి లోకేశ్ ప్రశంసలు**
- **తక్కువ సమయంలో ఇన్ని పనులు పూర్తి చేయడం రికార్డు స్థాయి పనితీరుకు నిదర్శనమని కితాబు**
- **కోటంరెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేశారని అభినందనలు**

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో రికార్డు సమయంలో అభివృద్ధి పనులు పూర్తి చేసిన స్థానిక శాసనసభ్యుడు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, ఆయన బృందం పనితీరును రాష్ట్ర ఐటీ, విద్య, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అభినందించారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న వారి నిబద్ధతను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి, కేవలం 60 రోజుల వ్యవధిలోనే రూ.41 కోట్ల అంచనా వ్యయంతో 339 అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రజలకు అంకితం చేయడం ఒక విశేషమని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఇంత తక్కువ సమయంలో ఇన్ని పనులు పూర్తి చేయడం రికార్డు స్థాయి పనితీరుకు నిదర్శనమని అభివర్ణించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి, ఆయన బృందం పనితీరు స్ఫూర్తిదాయకమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది నెలల కాలంలోనే నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి పెద్దపీట వేసిందని లోకేశ్ తెలిపారు. ఈ స్వల్ప కాలంలోనే రూ.231 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను నియోజకవర్గంలో ప్రారంభించినట్లు ఆయన వివరించారు. తమపై నమ్మకం ఉంచి ఓటు వేసిన ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అభివృద్ధి ఫలాలను ప్రతి గడపకూ చేర్చడంలో ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి చూపిస్తున్న చొరవ, కృషి ఆదర్శనీయమని మంత్రి కొనియాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, అభివృద్ధికి చిరునామాగా నియోజకవర్గాన్ని తీర్చిదిద్దాలనే తపన ప్రశంసనీయమని నారా లోకేశ్ వివరించారు.

# తిరుమల కల్యాణవేదికకు విశేష స్పందన..

## 26వేలకుపైగా వివాహాలు జరిపించిన తితిదే

తిరుమల: తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) నిర్వహిస్తోన్న ఉచిత వివాహాలకు విశేష స్పందన లభిస్తోంది. 2016 ఏప్రిల్ 25 నుంచి తిరుమల పాపవినాశనం రోడ్డులోని కళ్యాణ వేదిక వద్ద తితిదే ఉచితంగా వివాహాలు నిర్వహిస్తూ వస్తోంది. 2025 మే 1 వరకు తితిదే ఆధ్వర్యంలో 26,214 వివాహాలు జరిగాయని తితిదే వెల్లడించింది. వివాహాలు నిర్వహించిన అనంతరం వధూవరులు, వారి తల్లిదండ్రులతో కలిపి మొత్తంగా ఆరుగురికి ప్రత్యేక ప్రవేశ దర్శనం (రూ.300) ద్వారా శ్రీవారి దర్శనాన్ని కల్పిస్తారు. దర్శనానంతరం ఉచితంగా 6



లడ్డూలను లడ్డూ కౌంటర్ల వద్ద అందిస్తారు. అయితే, వివాహానికి వధూవరుల తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరుకావాల్సి ఉంటుంది. వారు రాలేని పరిస్థితిలో ఉంటే అందుకు సంబంధించిన ఆధార పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది.

# ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా కురుస్తోన్న వర్షాలు.. అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్‌తో హోంశాఖ మంత్రి అనిత ఫోన్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో తాజా పరిస్థితులపై ఆరా తీశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని వివిధ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలను అనిత ఆదేశించారు. అవసరమైతే సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని మంత్రి స్పష్టం చేశారు. తాగునీరు, విద్యుత్ సరఫరాకు ఆటంకం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు.





ఆంధ్రప్రదేశ్‌లో భిన్నమైన వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ ఇప్పటికే ప్రకటించారు. రెండు రోజుల పాటు రాష్ట్రంలో పలు చోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలోనే ఆదివారం బాపట్ల జిల్లాలో వర్షం దంచికొట్టింది. చీరాల, వేటపాలెం, చినగంజాం, కారంచేడు మండలాల్లో భారీ శబ్దాలతో ఉరుములు, పెనుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షం కారణంగా చీరాల పట్టణంలోని రహదారులు జలమయమయ్యాయి. చినగంజాం, పాత చీరాలలో పిడుగులు పడ్డాయి. చినగంజాంలోని రొంపేరు కాలువ సమీపంలో పిడుగుపాటుకు గేదెలు మేపుతున్న గడ్డం బ్రహ్మయ్య అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. విజయవాడ నగరంలోనూ ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు.

# హెలికాప్టర్‌పైకి వైకాపా కార్యకర్తలు దూసుకెళ్లిన కేసు..

## పోలీసుల అదుపులో ఏడుగురు

అనంతపురం: గత నెలలో శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి మండలం కుంటిమద్దిలో మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటన సందర్భంగా హెలికాప్టర్‌పైకి వైకాపా కార్యకర్తలు దూసుకెళ్లిన కేసులో పురోగతి లభించింది. ఏడుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలించి వారిని గుర్తించారు. మరికొంత మంది నిందితుల గాలింపు కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ టీమ్స్ బెంగళూరు, విజయవాడ, హైదరాబాద్‌కు వెళ్లాయి. ఏప్రిల్ 8న కుంటిమద్దిలో హెలికాప్టర్‌పైకి వైకాపా కార్యకర్తలు దూసుకెళ్లారు. కార్యకర్తలను నియంత్రించేందుకు యత్నించిన పోలీసులను వైకాపా నేత, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి దుర్భాషలాడారు. ఈ కేసులో ఇప్పటివరకు 15 మంది నిందితులను పోలీసులు గుర్తించారు.




# మరోసారి మానవత్వాన్ని చాటుకున్న మంత్రి నాదెండ్ల

- **ఏలూరు జిల్లా భీమడోలు వద్ద రోడ్డు ప్రమాదం**
- **ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఇన్నోవా: ఇద్దరికి తీవ్ర గాయాలు**
- **మంత్రి నాదెండ్ల మనోహర్ కాన్వాయ్ ఆపి సహాయ చర్యలు**

ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మానవతా దృక్పథంతో స్పందించి, రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి సత్వర సహాయం అందించారు. విజయవాడ నుంచి కాకినాడ వెళుతున్న సమయంలో, ఏలూరు జిల్లా భీమడోలు మండలం ఎం. నాగులపల్లి అడ్డరోడ్డు సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగిన విషయాన్ని ఆయన గమనించారు. బాధితులకు సకాలంలో చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే, జాతీయ రహదారిపై



వేగంగా వెళుతున్న ఒక ఇన్నోవా కారు అదుపుతప్పి ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడి రోడ్డుపై పడిపోయారు. అదే మార్గంలో తన పర్యటన నిమిత్తం వెళుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ ప్రమాదాన్ని గమనించి వెంటనే తన కాన్వాయ్‌ను ఆపాలని ఆదేశించారు. క్షతగాత్రుల పరిస్థితిని చూసి చలించిన మంత్రి, తక్షణమే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. హుటాహుటిన 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. అంబులెన్స్ ఘటనా స్థలానికి చేరుకున్నాక, బాధితులను త్వరగా ఆసుపత్రికి తరలించేందుకు వీలుగా తన కాన్వాయ్‌లోని ప్రోటోకాల్ వాహనాన్ని అంబులెన్స్‌కు ఎస్కార్ట్‌గా పంపాలని సిబ్బందిని ఆదేశించారు. అంతటితో ఆగకుండా, ఏలూరు జిల్లా ఎస్పీకి స్వయంగా ఫోన్ చేసిన మంత్రి నాదెండ్ల మనోహర్, గాయపడిన ఇద్దరికీ మెరుగైన వైద్యం అందేలా చూడాలని, అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. మంత్రి సమయస్ఫూర్తితో స్పందించి చేసిన సహాయం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం మంత్రి తన పర్యటనను కొనసాగించారు.

# ఈ పూలు... వాడిపోవు!



**చక్కటి డ్రెస్సూ, అదిరే హెయిర్‌స్టైలూ వేస్తే సరిపోతుందా... అంటూ పెళ్లిళ్లూ, పేరంటాలకు వెళ్లే అమ్మాయిలు అంతకుమించి పూల అందాలతోనూ సిద్ధమైపోతారు. కానీ మిగతా ముస్తాబులా ఆ పువ్వులూ రోజంతా తాజాగానే ఉండవు కదా! ఇప్పుడు ఆ ఇబ్బందీ లేకుండా ఉండటానికే ఆర్టిఫిషియల్ ఫ్లవర్ క్లిప్పుల్నీ వాలుజడల్లో పెట్టేస్తున్నారు!**

పువ్వుల్నీ, పడతుల్నీ అస్సలు విడదీయలేం. కొప్పులో ఒదిగిపోయిన పువ్వులతో అతివలకు ఎంతో అందం వస్తుంది. ఆకుల మధ్యలోంచి తొంగిచూసే పువ్వుల సౌందర్యమూ అమ్మాయి సిగలోకి చేరినప్పుడే అందర్నీ ఆకర్షిస్తుంది కూడా. ఆడవాళ్ల మేకప్‌లో పువ్వులకి అంత ప్రాధాన్యం ఉంది కాబట్టే చాన్నాళ్లక్రితమే ఆర్టిఫిషియల్ మల్లెలూ, కనకాంబరాల మాలల్ని తీసుకొచ్చారు తయారీదారులు. అసలైన పువ్వుల్ని పూర్తిగా మరిపించకపోయినా వాటి లోటును భర్తీ చేసే ఆ పూలతోనూ తలని సింగారించుకున్నారు కొందరు. కానీ ఈతరం అమ్మాయిలు మెచ్చేట్లు ఉండాలంటే ఆ కృత్రిమ పూలూ నిజమైన వాటిని తలపిస్తూనే, అన్ని రకాల హెయిర్ స్టైల్స్‌కీ సరిపోయేలానూ ఉండాలి కదా. ఆ ముచ్చట తీర్చడానికే ఈమధ్య బోలెడన్ని పువ్వులతో క్లిప్పులెన్నెన్నో వచ్చేశాయి. బేబీ కట్‌కి హెయిర్‌బ్యాండ్లు, జుట్టు పైకి లేవకుండా పిన్నులు, పోనీకి క్లిప్పులు, వాలుజడకి బ్యాండ్లు... ఇలా హెయిర్ స్టైల్‌ని బట్టి పిల్లల నుంచి పెద్దల వరకూ రకరకాల యాక్సెసరీస్‌ను ఎంచుకుంటారు. ఇప్పుడు వాటితో ఈ కృత్రిమ పూలు జత కట్టాయి. ఎప్పుడూ తాజాగా కనిపిస్తూ ఫంక్షన్లలో ప్రత్యేకంగా మెరుస్తున్నాయి.

**ఎన్ని అందాలో...**

మల్లె, చామంతి, బంతి, సంపెంగ, గులాబీ, లిల్లీ... వంటి సంప్రదాయ పూల వెరైటీల దగ్గర్నుంచి తాజాగా ట్రెండీ పూలజడల్లో భాగమైన చిట్టిచిట్టి బేబీస్ బ్రెత్ పువ్వుల వరకూ ప్రతిదీ ఈ ఫ్లవర్ క్లిప్పుల్లో చేరిపోయింది. వివిధ సైజుల్లోని ఈ మొగ్గలూ, విరబూసిన పువ్వులూ నిజమైన వాటిల్లానే లేతముదురు రంగుల్లో కనువిందుచేస్తుంటాయి. జడ వేసుకుని విడిగా పూలు పెట్టుకోవడం కన్నా ఆ హెయిర్ స్టైల్ కోసం ఉపయోగించే సాదా క్లిప్పులు, పిన్నులు, బ్యాండులతోనూ తలకి పువ్వులు పెట్టుకోవచ్చన్న మాట. ఇటు ట్రెడిషనల్ మేకప్‌కీ, అటు ట్రెండీ లుక్కుకూ నప్పేలా దొరుకుతున్న వీటిల్లో ఒంటి పువ్వు క్లిప్పు మొదలు పొడవైన జుట్టుకు చుట్టే పూల అల్లికల వరకూ చాలానే వస్తున్నాయి. మరెందుకాలస్యం... ప్రతి మధుర క్షణాన్నీ ఫొటోల్లో, వీడియోల్లో బంధించే ఈ టెక్‌యుగంలో చెదిరిపోని అందం కోసం ఫ్యాషన్ ట్రెండ్స్‌ని ఫాలో అయిపోతూనే వసివాడని ఈ పువ్వుల క్లిప్పుల్నీ మీ సింగారంలో చేర్చేయండి!















# ఇళ్లు కట్టించే ఆలయమిది




కేరళలో పండుగ ఉత్సవాల్లోనూ, ఉరేగింపుల్లోనూ ఏనుగులు తప్పనిసరి. వాటిని ప్రత్యేకంగా అలంకరించి ఆ వేడుకల్లో భాగం చేస్తారు. అందుకే అక్కడ ప్రతి ఆలయంలో కమిటీ సభ్యులు ఏనుగులను సంరక్షిస్తుంటారు. మరోవైపు మొక్కులు ఉన్నవారూ కొన్నిటిని సమర్పిస్తుంటారు. వాటి నిర్వహణకు పదిహేను నుంచి ఇరవై లక్షల దాకా ఖర్చు అవుతుంది. అయితే కేరళలోని కోట్టయం దగ్గరున్న కుమారకోమ్ గ్రామంలో కొలువైన శ్రీకుమారమంగళం సుబ్రమణ్యస్వామి ఆలయకమిటీ మాత్రం దాదాపు వందేళ్లకుపైగా వస్తున్న ఆ ఆచారానికి ఫుల్‌స్టాప్ పెట్టింది. సంప్రదాయం పేరుతో ఏనుగులను ఇబ్బంది పెట్టకూడదనీ, వాటి స్వేచ్ఛకు భంగం కలిగించకూడదనీ నిర్ణయించుకుంది. తమ వద్ద ఉన్న ఐదు ఏనుగుల్ని అడవిలో వదిలేయడంతోపాటు వాటి సంరక్షణకు ఏటా వెచ్చించే డబ్బుతో పేదలకు ఇళ్లు కట్టించాలనీ, ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆర్థిక సాయం చేయాలనీ నిర్ణయించారు కమిటీ సభ్యులు. నాలుగువేల మంది ఉండే ఆ గ్రామంలో... ఇల్లు లేని వారిని గుర్తించి నిర్మాణాలు మొదలుపెట్టారు. ఇప్పటి వరకూ ఐదు కుటుంబాలకు సింగిల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఇచ్చారు. ఓ పదిమంది నిరుపేద ఆడపిల్లల పెళ్లికి లక్ష చొప్పున అందించి మానవసేవకు పెద్దపీట వేస్తున్నారు కుమారకోమ్ వాసులు.



## స్పీడు పెంచిన
# కర్లీ బ్యూటీ..


టాకీస్: పదేళ్లుగా ఇండస్ట్రీలో కొనసాగుతున్న కెరియర్ లో హై పాయింట్ ని మాత్రం చూడలేకపోయారు మలయాళ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్. మంచి హిట్స్ ఉన్న స్టార్ లీగ్ లో ఈ బ్యూటీ పేరు కనిపించలేదు.  కానీ అప్ కమింగ్ సినిమాలతో ఆ కోరిక కూడా తీరబోతుందని కాన్ఫిడెన్స్ తో ఉన్నారు ఈ బ్యూటీ. ఎలాగో ఈ స్టోరీలో చూద్దాం. రౌడీ బాయ్స్, కార్తికేయ 2, టిల్లు స్క్వేర్ సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ సాధించిన అనుపమ ఇప్పుడు మరింత జోష్ తో దూసుకుపోతున్నారు. కెరియర్ మంచి ఫామ్ లోకి రావడంతో ఈసారి గాడి తప్పకుండా ఉండేలా జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. అదే టైంలో వరుస సినిమాలు చేస్తూ స్పీడ్ చూపిస్తున్నారు. అప్ కమింగ్ సినిమాల్లో గ్లామర్ డోస్ కూడా పెంచే అభిమానులను అలరిస్తున్నారు. రీసెంట్ గా డ్రాగన్ సినిమాతో మరో హిట్ ను తన ఖాతాలో వేసుకున్న అనుపమ ప్రెజెంట్ వరుస సినిమాలు లైన్ లో పెట్టేస్తున్నారు. ప్రెజెంట్ పరద అనే లేడీ ఓరియెంటెడ్ సినిమాతో పాటు బెల్లంకొండ సాయి శ్రీనివాస్, కిశోర్ కుమార్, శర్వానంద్ భోగి సినిమాల్లో నటిస్తున్నారు. ఈ సినిమాలతో స్టార్ లీగ్ లోకి ఎంటర్ అవ్వాలని కష్టపడుతున్నారు అనుపమ. మరి అమ్మడి కలలు ఎంతవరకు నెరవేరుతాయో చూడాలి.



Anupama Parameswaran

## రూ. 100 కోట్ల మార్క్‌వైపు
# 'హిట్-3' పరుగులు

టాకీస్: ఈ మధ్య కాలంలో బాక్సాఫీస్‌ని షేక్ చేసిన చిత్రాలలో నాని హిట్ 3 చిత్రం ఒకటి. ఈ మూవీ బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేస్తుందో మనం చూస్తూనే ఉన్నాం. మొదటి రోజు ఈ మూవీకి 43 కోట్ల రేంజ్‌లో గ్రాస్ కలెక్షన్స్ వచ్చాయి . ఇక రెండు రోజుల్లోనే నాని సినిమాకు 62 కోట్లు దాటాయి. ఇక మూడో రోజు కూడా మంచి నంబర్ వస్తుందని అంతా అనుకున్నారు. ట్రేడ్ వర్గాల అంచనాలకు తగ్గట్టుగా ఈ మూవీకి మూడు రోజుల్లో అదిరిపోయే వసూళ్లు వచ్చాయి. శనివారం ఒక్క రోజే రూ.20 కోట్లు వసూలు చేసిన ఈ సినిమా, థియేటర్లలో హౌస్‌ఫుల్ బోర్డులతో దూసుకెళ్తోంది. వర్డ్ ఆఫ్ మౌత్, అద్భుతమైన ఆక్యుపెన్సీతో ఈ సినిమా అంతటా మంచి రెస్పాన్స్ దక్కించుకుంటుంది. . నార్త్ అమెరికాలో కూడా 'హిట్ 3' జోరు చూపిస్తోంది. ఇప్పటికే  1.8 మిలియన్లు వసూలు చేసిన ఈ చిత్రం, 2 మిలియన్ల క్లబ్‌లోకి అడుగుపెట్టే దిశగా దూసుకెళ్తోంది. ఈ సినిమా కోసం నానా ఎంతలా కష్టపడ్డాడో అందరికీ తెలిసిందే. షూటింగ్ చేస్తుండగా నానికి గాయాలు అయ్యాయి. తలకి గాయం, మొహానికి ఫైర్ అంటుకోవడం , రక్తం కారిన, కుట్లు వేసినా, ఫైర్ అంటుకున్నా కూడా అవేమి లెక్క చేయకుండా షూటింగ్ చేశాడు. తాను పడిన కష్టానికి మంచి ప్రతిఫలం వస్తుండడంతో నాని




హిట్ 3 చిత్రానికి మూడు రోజుల్లో 82 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు రాగా, ఈ విషయాన్ని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. వాల్ పోస్టర్ టీం వదిలిన ఈ కలెక్షన్ పోస్టర్ ఇప్పుడు వైరల్ అవుతోంది. ఈ లెక్కన ఆదివారం నాడు మరింతగా కలెక్షన్స్ పెరిగే అవకాశం లేదు. వీకెండ్‌లోనే ఈ చిత్రం వంద కోట్ల మార్క్ చేరుకుంటుందని ట్రేడ్ పండితులు భావిస్తున్నారు. కూడా ఫుల్ హ్యాపీగా ఉన్నారు. చిత్రానికి మిక్కీ అద్భుతంగా బీజీఎం ఇచ్చాడని, ఏ సీన్‌కు ఎంత ఇవ్వాలి.. ఎక్కడ ఎంత కొట్టాలో అక్కడ అంతే కొట్టాడని, తనకు ఎలాంటి అవుట్ పుట్ అడిగానో అలాంటి అవుట్ పుట్ ఇచ్చాడని దర్శకుడు శైలేష్ రీసెంట్ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చాడు. మొత్తానికి ఈ చిత్రం నాని కెరియర్‌లో వన్ ఆఫ్ ది బెస్ట్ మూవీగా నిలిచింది.




# త్రిష బర్త్‌డే ట్రీట్..

## 'విశ్వంభర' నుంచి కొత్త పోస్టర్ విడుదల


టాకీస్: టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి హీరోగా 'బింబిసార' ఫేమ్ వశిష్ట దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'విశ్వంభర'. ఈ మూవీ నుంచి తాజాగా కొత్త పోస్టర్ విడుదలైంది. ఆదివారం హీరోయిన్ త్రిష పుట్టినరోజు సందర్భంగా ఆమె పాత్ర 'అవని'ని పరిచయం చేస్తూ మేకర్స్ పోస్టర్‌ను పంచుకున్నారు. ఈ సందర్భంగా చిత్రం యూనిట్ ఆమెకు బర్త్‌డే విషెస్ తెలుపుతూ కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. చీరకట్టులో సంప్రదాయంగా చిరునవ్వులు చిందిస్తున్న త్రిష ఫొటో చూడగానే ఆకట్టుకునేలా ఉంది. ఇక, ఈ చిత్రం నుంచి ఫస్ట్ సింగిల్ 'రామ రామ' అంటూ సాగే పాటను హనుమాన్ జయంతి కానుకగా ఏప్రిల్ 12న విడుదల చేయగా మంచి రెస్పాన్స్ వచ్చిన విషయం తెలిసిందే. ఆస్కార్ అవార్డు విజేత ఎం.ఎం కీరవాణి స్వరాలు సమకూర్చిన ఈ పాటకు రామజోగయ్యశాస్త్రి లిరిక్స్ అందించారు. కాగా, ఈ సోషియో ఫాంటసీ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్, విక్రమ్ నిర్మిస్తున్నారు. స్టాలిన్ మూవీ తర్వాత మెగాస్టార్ సరసన మరోసారి త్రిష ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఆషికా రంగనాథ్, బాలీవుడ్ నటుడు కునాల్ కపూర్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# 'హరి హర వీరమల్లు' ఫైనల్ షెడ్యూల్ కోసం పవన్ రెడీ

## 'హరి హర వీరమల్లు' ఫైనల్ షెడ్యూల్ కోసం పవన్ రెడీ

టాకీస్: ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న 'హరి హర వీరమల్లు' చిత్రం చారిత్రక నేపథ్యంలో రూపొందుతోంది. 'రూల్స్ రంజన్' ఫేమ్ జ్యోతి కృష్ణ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. రెండు భాగాలుగా రానున్న ఈ సినిమా మొదటి భాగం 'హరిహర వీరమల్లు పార్ట్ 1: స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, వీడియో గ్లింప్స్, పాటలతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. మొదటి భాగం చిత్రీకరణ దాదాపు ముగింపు దశకు చేరుకుంది. అయితే, పవన్ కళ్యాణ్ రాజకీయాల్లో బిజీగా ఉండటం వల్ల మిగిలిన చిత్రీకరణ వాయిదా పడుతూ వచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు మళ్ళీ ఈ చిత్ర షూటింగ్ ప్రారంభం కానుంది.

తాజా సమాచారం ప్రకారం, పవన్ కళ్యాణ్ మే 4 నుండి షూటింగ్‌లో పాల్గొనబోతున్నట్లు తెలుస్తుంది. మే 7-8 తేదీలలో షూటింగ్ పూర్తి చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఆ



తర్వాత పోస్ట్ ప్రొడక్షన్ పనులు ప్రారంభించనున్నారు. ఈ సినిమాలో మొత్తం 6 యాక్షన్ సీక్వెన్స్‌లు ఉండగా, 20 నిమిషాల నిడివి గల ఒక యాక్షన్ సీక్వెన్స్‌ను పవన్ కళ్యాణ్ స్వయంగా రూపొందించారు. ఈ సీక్వెన్స్‌లో 1100 మంది పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ స్టూడియోలో 61 రోజుల పాటు చిత్రీకరించారు. దీని కోసం పవన్ ఎంతో కష్టపడ్డారని, అంతర్జాతీయ స్టంట్ కొరియోగ్రాఫర్లతో చర్చించారని దర్శకుడు తెలిపారు. సినిమా మొత్తంలో ఇదే హైలైట్ కానుందని ఆయన పేర్కొన్నారు.

ఈ చిత్రంలో నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ నటులు అర్జున్ రాంపాల్, నర్గీస్ ఫక్రీ, బాబీ డియోల్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. సంగీత దిగ్గజం ఎంఎం కీరవాణి ఈ చిత్రానికి సంగీతం మరియు నేపథ్య సంగీతం అందిస్తున్నారు.

# విజయ్ సేతుపతి, నిత్యా మీనన్ కాంబో..

## 'తలైవన్ తలైవి' టైటిల్ టీజర్ విడుదల!



టాకీస్: తమిళ నటుడు మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి, నేషనల్ అవార్డు విన్నర్ నటి నిత్యా మీనన్ కలిసి ఒక సినిమాలో నటిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ చిత్రానికి ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు మేకర్స్. పాండిరాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి 'తలైవన్ తలైవి' అనే పేరు పెట్టారు. ఈ సినిమా టైటిల్‌ను ప్రకటిస్తూ చిత్రబృందం తాజాగా ఓ టీజర్‌ను విడుదల చేసింది. తమిళంలో 'తలైవన్' అంటే నాయకుడు అని, 'తలైవి' అంటే నాయకురాలు అని అర్థం. ఈ టీజర్‌లో విజయ్ సేతుపతి, నిత్యా మీనన్ మధ్య ఉండే కెమిస్ట్రీని చూపించారు మేకర్స్. సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం యొక్క టైటిల్ టీజర్‌కు ప్రేక్షకుల నుంచి విశేషమైన స్పందన లభిస్తోంది.




# 'పార్కింగ్' దర్శకుడితో కొత్త సినిమా ప్రారంభించిన శింబు

టాకీస్: తమిళ స్టార్ హీరో సిలంబరసన్ టీఆర్(శింబు) మళ్లీ వరుస ప్రాజెక్టులను ఒకే చేస్తున్నాడు. ఇప్పటికే మణిరత్నం దర్శకత్వంలో రాబోతున్న థగ్ లైఫ్ సినిమాలో కీలక పాత్రలో నటించబోతున్న శింబు మరో క్రేజీ ప్రాజెక్ట్‌ను ఒకే చేశాడు. శింబు తన తదుపరి చిత్రం 'ఎస్టీఆర్ 49'తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఈ సినిమా శనివారం చెన్నైలో గ్రాండ్ లాంచింగ్‌తో ప్రారంభమైంది. ఈ చిత్రంలో ప్రముఖ నటుడు సంతానం కీలక పాత్ర పోషిస్తున్నారు. వీరిద్దరూ 2015లో వచ్చిన 'వాలు' చిత్రం తర్వాత మళ్లీ కలిసి నటిస్తుండటంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. 'పార్కింగ్' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న రామ్‌కుమార్ బాలకృష్ణన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా.. డాన్ పిక్చర్స్ బ్యానర్‌పై ఈ చిత్రం నిర్మితమవుతోంది. సిలంబరసన్‌కు జోడీగా 'డ్రాగన్' ఫేమ్ కాయదు లోహర్ నటిస్తుండగా, సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రం కళాశాల నేపథ్యంలో సాగనుందని సమాచారం. తమిళ చిత్రాల్లో కనిపించే చెన్నై కాకుండా, హైదరాబాద్, కేరళలోని అందమైన క్యాంపస్‌లలో ఈ సినిమా షూటింగ్ జరగనుంది. కథలో సంతానం పాత్రకు ఎంతో ప్రాముఖ్యత ఉంటుందని, సిలంబరసన్ స్వయంగా ఆయన పాత్ర ప్రాధాన్యతను పెంచేలా చూసుకున్నారని తెలుస్తోంది. ఈ సినిమా షూటింగ్ ఏప్రిల్ 2025 రెండవ వారంలో ప్రారంభం కావాల్సి ఉండగా, తాజాగా లాంచింగ్ కార్యక్రమం జరిగింది. సిలంబరసన్ నటిస్తున్న ఈ 49వ చిత్రంపై ఆయన అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025  RNI.No. APTEL/2009/29786.